
# ఈ వారం కథ

## బొంగు వేణుగోపాలరావు

‘‘సార్.. మీకు టెలిగ్రామ్’’ అన్నాడు పోస్టుమాన్ నన్ను చూసి
సందేహంగా చూశాను.
‘‘మీకేసార్...’’ అన్నాడు.
క్షణాల్లో మనసు ఉద్వేగభరితమైంది. సంతకం చేయడానికి చేతులు వణికాయి. ఉద్వేగాన్ని చిక్కబట్టి మెల్లగా చదివాను.
‘‘ఫాదర్ సీరియస్... స్టార్ట్ ఇమ్మిడియెట్లీ’’ మెదడు మొద్దుబారింది. కాళ్లు వణుకుతున్నాయి. మనసు పరిపరివిధాలుగా పోతుంది.
‘‘బాగున్నామని ఉత్తరమొచ్చి పది రోజులు కూడా కాలేదు. ఇంతలో సీరియస్సా!! నీరసం మనిషి కూడా కాదు. ఆరోగ్యంగా ఉంటారు. ఇంతలో ఏమైంది...!?’’ ఆలోచనకి అందడంలేదు.
రెండు జతల బట్టలు సూట్‌కేసులో వేసుకొని ఉన్నపళంగా గోదావరి ఎక్స్‌ప్రెస్‌కి బయలుదేరాను.
బండిలో కూర్చున్నా మనసు పరిపరివిధాలుగా పోతోంది. టెలిగ్రామ్ తీసి మళ్లీ ఒకసారి చూసుకున్నాను. క్రింద బాబాయి పేరూ ఎడ్రెస్ ఉంది. ఏమిటో అంతా విచిత్రం... గంట క్రితానికి ఇప్పటికి ఎంత మార్పు. విధిలీల...
నాన్న రూపం కళ్ళముందు కదలాడుతోంది. భాగస్థుల నుండి వేరుపడినపుడు ఎదుర్కొన్న పరిస్థితులు. పడ్డ బాధలు, మమ్మల్ని చదివించి ఇంత వాళ్ళను చేయడానికి ఆయన పడ్డ శ్రమ అంతా సినిమా రీళ్ళలా కళ్ళముందు తిరుగుతోంది.
మా కోసం తన బ్రతుకును అంకితం చేసిన మనిషి అపాయంలో ఉంటే చూడలేని పరిస్థితి. పిల్లలు ఉండీ లేనట్లే.
పుట్టిపెరిగిన ఊరును వదిలి రాలేని పెద్దల మనస్తత్వం.
ఊహకందని దూరంలో ఉద్యోగాలు చేసే పిల్లలు...
వ్యక్తి భవిష్యత్తే ముఖ్యమని మిగతావన్నీ మజిలీలని తెలిపే ఆధునిక జీవన విధానం...
బ్రతుకులు... భవిష్యత్తు.. ఆశలు.. ఆశయాలు వీటన్నిటిలో ఏదో లోపము... అసమగ్రత ఉన్నట్లనిపిస్తోంది.
నాన్నకేమన్నా అయితే... అమ్మ బ్రతకగలదా...!!
బండి దిగిన వెంటనే బాబాయిని కలిశాను. నాన్నకు సంబంధించిన విషయాలు ఆయనకే తెలుస్తాయి. అందుకని ముందుగా అతన్ని కలిశాను.
‘‘నాన్నకు ఏమైంది?’’ నా కంఠంలో జీర.
‘‘హాస్పిటల్‌లో ఉన్నాడు. ప్రమాదమేమీలేదులే... గండం తప్పింది’’ అన్నాడు.
ప్రాణాపాయం లేదని రూఢీ అయిన తరువాత మనసు కొంత తేలిక పడింది.
‘‘గండమా!’’ అన్నాను ఆశ్చర్యంగా.
‘‘చావు తప్పి బ్రతికితే గండం కాదా మరి’’ అన్నాడు తనదైన ధోరణిలో.
‘‘నాకేమీ అర్థం కాలేదు. వివరంగా చెప్పు బాబాయ్...’’ అన్నాడు బ్రతిమాలుతూ.
‘‘షుగరు, బిపి ఉన్నోళ్ళు ఎంత జాగ్రత్తగా ఉండాలి? మరి ఈయన వారం రోజులు తిండి మానేశాడట...’’ అన్నాడు కోపంగా.
‘‘వారం రోజులు... తిండి మానేశాడా?!’’
‘‘అవున్రా... సరిగ్గా వారం రోజులు మెతుకు ముట్టలేదు... నీరసంతో మంచమెక్కాడు కాబట్టి నాకు తెలిసింది. లేకపోతే ఇంకెన్నాళ్ళు గడిచేదో...’’
‘‘ఏం... ఎందుకని?’’
‘‘ఏమో...ఎవరికి తెలుసు. ఏనాడైనా ఎవరికైనా ఏదన్నా చెప్పాడా?’’
‘‘అయితే ఎవరికి తెలీదా..!!’’
‘‘ఎవరికీ తెలీదు. ఆరోగ్యం బాగా లేదు కాబట్టి హాస్పిటల్‌కి తీసుకెళ్ళాం. మేం చేయాల్సింది చేశాం.’’
‘‘అమ్మక్కూడా తెలీదా?’’ సందేహంగా అడిగాను.
‘‘తెలీకుండా ఎలా వుంటుంది. కాని ఆమె మాట్లాడటం లేదు.’’
‘‘సరే అమ్మనే అడుగుతాను...’’
‘‘ముందు మీ నాన్నని అడుగు. తర్వాత మీ అమ్మనడుగు’’ అన్నాడు బాబాయి.
సరేనని చెప్పి అక్కడ నుండి కదిలాను.
నాన్న వారం రోజులు తిండి మానెయ్యడం ఏమిటి?
అలక... అలగాల్సిన అవసరం ఆయనకేమొచ్చింది?
ఇన్నేళ్ళుగా ఆయన అలగడం నేనెప్పుడూ చూడలేదు...
నాన్న మాటే అమ్మమాట. నాన్న మాట ఏనాడూ ఆమె జవదాటడమెరుగదు. అలాంటప్పుడు ఎవరిమీద ఈ అలక... నాకేమీ అర్థంకాలేదు.



హాస్పిటల్‌కి వెళ్ళాను. అమ్మ అప్పుడే ఇంటికెళ్ళిందని చెప్పారు. నన్ను చూడగానే నాన్న కదిలిపోయాడు. కళ్ల వెంట నీళ్లు తిరిగాయి. మనిషి నీరసంగా కృశించి ఉన్నాడు.
కౌగిలించుకొని ఏడ్చాడు. నా గుండె బరువెక్కింది.
‘‘ఏమైంది నాన్నా! ఇంత నీరసంగా ఉన్నావేమిటి?’’ అన్నాను.
‘‘ఏమీ లేదురా. నిన్ను చూడాలనిపించింది’’ అన్నాడు. విషయం నాకు తెలీదు అనుకున్నాడు.
‘‘వారం రోజులు తిండి తినలేదటా... ఎందుకు?’’
ఆ మాటకి నాన్న ఆశ్చర్యపోయాడు. ముఖంలో ఫీలింగ్స్ మార్చుకొని ‘‘ఎవరు చెప్పారు?’’ అన్నాడు.
‘‘ఎవరైతేనేం... నిజమా కాదా?’’ అన్నాను ముఖంలోకి చూస్తూ.
మాట్లాడలేదు. తలవంచుకొని ఆలోచిస్తున్నాడు.
‘‘నాతో చెప్పకూడదా...’’ అనునయించాను.
నావైపు పరిశీలనగా చూసి తలదించుకొన్నాడు.
‘‘వారం రోజులు తిండి మానేయాల్సిన ఖర్మ ఏమిటో’’
‘‘మిమ్మల్ని వదిలి చావలేక...’’ బిక్కగా అన్నాడు.
‘‘సింహం లాంటి మీకు చావాల్సిన అవసరమేంటో’’
‘‘చెప్పు దెబ్బ తిన్నాక సింహం బతకాలనుకోదు’’ అన్నాడు సీరియస్‌గా.
‘‘వివరంగా చెప్పు నాన్నా.. నాకేమీ అర్థం కాలేదు’’ అన్నాను.
‘‘మీ అమ్మ నన్ను కొడతానని చెయ్యి ఎత్తింది. అంతకంటే ఏం కావాలి. ఇక నేనెందుకు బ్రతకాలి’’ ఆవేశంగా చెప్పాడు.
షాక్ అయ్యాను. నాన్నకెదురుగా నిలబడడానికే భయపడుతుంది అమ్మ.
నమ్మలేకపోయాను.
‘‘కలలో కూడా జరుగదు. నేన్నమ్మలేను’’ అన్నాను.
‘‘అందుకేరా ఎవరికీ చెప్పుకోలేకపోయాను. కాని నువ్వు కూడా నమ్మకపోతే నా దురదృష్టం అనుకుంటా...’’
‘‘ఆ సంఘటనకు దారితీసిన పరిస్థితులేమిటి?’’
‘‘ఏమీ లేదు.. రోజూ ఏదో గొడవ ఉంటూనే వుంటదిగదా... అలాగే అనుకున్నా..’’
‘‘నాకెందుకో నమ్మకం కలగలేదు...’’
‘‘ఇంకా నమ్మలేకపోతే ఇప్పుడే వెళ్ళి మీ అమ్మనడుగు. ఏం చెబుతుందో.’’
అమ్మ దగ్గరకు వెళ్ళాను.
నన్ను చూడగానే అమ్మ ముఖంలో ఏదో వెలుగు ప్రసరించినట్లయింది. [illegible]
‘‘ఏమైందమ్మా, ఏమిటీ రాద్ధాంతమంతా..?’’
‘‘ఏముందిరా మామూలే...’’
‘‘వారం రోజులు తిండి మానేయటం మామూలు విషయం కాదు.’’
‘‘అది ఆయన ఇష్టం. నన్నేం చెయ్యమంటావ్’’
‘‘తిండి మానెయ్యడం ఎవరికైనా సరదానా... నువ్వు తనపై చెయ్యి చేసుకోబోయావని...’’ నసిగాను.
అమ్మ ముఖం ఎర్రబడింది. కళ్ళల్లో నీళ్ళు చిమ్మాయి.
‘‘ఆయనకేం... మగమహారాజు అలాగే అంటాడు. ముప్పయి సంవత్సరాలుగా చూస్తున్నావు కదరా... నీకు తెలీదా...’’
‘‘అసలేం జరిగిందో వివరంగా చెప్పమ్మా...’’
‘‘పది రోజుల క్రితం జ్వరం వచ్చింది. ఒళ్లంతా నొప్పులు, విపరీతమైన తలనొప్పి, తీవ్రమైన చలితో వణికిపోయాను. డాక్టరు మలేరియా జ్వరమని చెప్పి మాత్రలు, ఇంజెక్షను ఇచ్చాడు. వారం రోజులు రెస్ట్ తీసుకోమన్నారు.

జ్వరం తగ్గింది.. ఉదయాన్నే లేస్తూ టీ పెట్టమన్నారు. జ్వరం తగ్గినా నీరసం తగ్గలేదు. లేవలేకపోయాను. మీరు పెట్టుకోండి అన్నాను. ఆ మాత్రం దానికి నోటికొచ్చినట్టు మాట్లాడారు. నేను సహించలేకపోయాను. మీరొక్క మాటా డినా పడేది లేదన్నాను.

నాకే ఎదురుచెబుతావా... పళ్ళు రాలగొడతానని చెయ్యె త్తారు. సహనం నశించింది. ఎత్తిన చెయ్యి పట్టుకున్నాను. కొట్టడం మీకేకాదు. నాకూ చేతనవును అన్నాను. అంతే.. అప్పటినుండీ అలక...

నువ్వు చిన్నప్పటినుండి చూస్తున్నావుగా అకారణంగా నన్ను ఎన్నిసార్లు తిట్టలేదూ... అనవసరంగా ఎన్నిసార్లు కొట్ట లేదూ... నేను తిండి మానేసి వారాల తరబడి అలిగినా... పోనీలే అని సర్దుకుపోలేదూ ఎంతకాలం సర్దుకుపోవాలి... ముప్పైయేళ్ళుగా సర్దుకుపోతున్నాగదా..ఒకసారికి ఆయన సర్దుకుపోలేడా... నాకూ ఏభైపైబడింది. ఒంట్లో శక్తి సన్నగి ల్లుతోంది. ఏదో సర్దుకుపోవాలి తప్ప అన్నీ టైం ప్రకారం చెయ్యాలి అంటే నావల్ల కాదు. ఇన్నాళ్ళూ మీకోసం పడ్డాను.. ఇంకా ఎవరికోసం పడాలి...'' కళ్ళు తుడుచు కొంది అమ్మ.

విషయం అర్థమైంది.

''బాధపడకమ్మా.. నేను నాన్నతో మాట్లాడుతాను'' అన్నాను.

'ఎవరెన్ని చెప్పినా ఆయన వినరురా'' అంది అమ్మ.

'నీకెందుకు నేను చెబుతాగదా...'' అన్నాను.

నాన్న దగ్గరకెళ్ళాను.

''మీ అమ్మకి గట్టిగా బుద్ధి చెప్పావా?'' నాన్న అడిగిన మొదటి మాట అది. దాని వెనుక ఎంత అహం ఉండాలి.

''చెప్పాను..'' అన్నాను. నాన్న మనసు చల్లబడింది.

'ఏమంది?' ఆత్రంగా అడిగేడు.

''పొరబాటేనని ఒప్పుకుంది'' అన్నాను.

ఎగిరి గంతేసినంత పని చేశాడు.

''కొడుకంటే నువ్వురా.. నా మనసు తెలుసుకున్నావ్'' అన్నాడు ఉప్పొంగుతూ.

''కానీ నాన్నా...''

''ఏమిట్రా... సందేహమెందుకు అడుగు...''

''మొత్తం విన్నాక అమ్మ వాదనలో కొంత నిజముందనిపిం చింది...''

''ఆమాటే మీ అమ్మ దగ్గర అన్నావా యేం?'' త్రుళ్లిప డ్డాడు.

''అమ్మతో అనలేదులే... ఆమెదే తప్పు అని మందలిం చాను. కాని నా మనసుకి అనిపించింది నీతో అంటు న్నాను...''

''ఏమిట్రా నిజము...'' నాన్నలో కాస్త గంభీరత చోటుచేసు కుంది.

''యాభై ఎనిమిదేళ్లకు రిటైర్‌మెంటు ఎందుకిస్తారు?''

''పని చేయడానికి పనికిరారని...''

''అంటే ఒక వయసు వచ్చాక ఎవరైనా సరే పని చేయడానికి పనికిరారు కదా.. మరి ఈ రూలు అమ్మకి వర్తించదా?''

నాన్న ఖంగుతిన్నాడు. కాసేపు ఆలోచించి-

''ఆఫీసు పని, ఇంటి పని ఒకటేనట్రా..'' అన్నాడు.

''ఇంట్లో పని మనకు కావాల్సినపుడు బ్రేకు తీసుకోవచ్చు. ఆఫీసు పనిలో అది కుదరదు అంతే తేడా..'' అన్నాను.

మౌనంగా చూశాడు నావైపు.

మీకు చెప్పేటంత వాడ్ని కాకపోయినా.. నేను చెప్పే మాట పెద్ద మనసు చేసుకొని వినండి.

ముప్పై సంవత్సరాలుగా మీ మాటకు ఎదురుచెప్పని మనిషి ఈ రోజున ఎదురు చెప్పిందంటే, మానసికంగా ఎంత క్షోభ పడిందో మీరు ఆమె వైపు నుండి ఆలోచించి చూడండి..

ఇన్నేళ్లుగా ఆమె మీకు సేవ చేసిందంటే మీరు యజమాని ఆమె బానిస కాదు. నా భర్త, నా మనిషి అనే మమకారంతో చేసింది. మీరు మాత్రం అధికారి, ఆమె బానిస అనే విధంగా చూశారు. కాలం మారినా మీరు మారలేదు. ఎన్నాళ్లు ఎదురుచూసినా మీలో మార్పు రాకపోయేసరికి ఆమెలో సహనం నశించింది..., దాని ఫలితమే ఇది.

ఒంట్లో శక్తి ఉన్నంత వరకు ఓర్పుగా పడింది. వార్థక్యంవల్ల మీలాగే ఆమె ఒంట్లో శక్తి సన్నగిల్లింది. ఆమె అస్తిత్వమే కష్ట మనిపించేటపుడు మీ అధికారాన్ని ఎలా మోయగలదు.

మనకు ఆత్మీయుడైనవాడు ఒక మాట అంటే బాధప డతాం. మీరు ఛీ అన్నా, ఛో అన్నా ఇన్నేళ్లుగా పడుతోంది. అంటే మీ మీద ఆమెకు ఎంత గౌరవము, అభిమానం ఉండి ఉండాలి! అందుకు ప్రతిఫలంగా మీరేమిచ్చారు...

ఆలుమగల్లో ఆకర్షణతో ప్రారంభమైన బంధం కాలం గడు స్తున్నకొద్దీ పరస్పరం ఆత్మీయతానురాగాలతో ఆ బంధం మరింత గట్టిపడాలి. మీలో ఏదీ!!!

మేము పిల్లలం.. మధ్యలో వస్తాం మధ్యలో వెళ్ళిపోతాం. కాని కలకాలం కలిసుండాల్సింది మీరు.

అమ్మ పడే ఆవేదనని, మూగబాధని మీకు చెప్పాలనే తపనే ఇదంతా. నాకు మీరిద్దరూ రెండు కళ్ళు. ఆ రెండు సమా నంగా ఉండాలనే నా ఆరాటం... అన్నాను.

ఆయన్నుంచి ఏ విధమైన రెస్పాన్సు లేదు. పైనుండి కిందవ రకు నన్ను ఎగాదిగా చూసి చిన్నగా నవ్వేడు.

ఎలుకను చూసిన పిల్లి నవ్వు...

లేడిని చూసిన పులి నవ్వు...

గొర్రెను చూసిన కసాయివాడి నవ్వు...

సందేహం లేదు.. అదే నవ్వు...

రాయిని రాగాలు పలికించడం వ్యర్థ ప్రయత్నమని, చెవిటి వాని ముందు శంఖమూదానని అర్థమైంది నాకు.

★

## నందీప్రస్తావన

(6వ పేజీ తరువాయి)

అలో లక్ష్మణా అంటూ అలమటిస్తున్నారు. వాళ్ళకు ఇవ్వని ఉద్యోగాలు, రైల్వే ఫ్రీ పాసులు వీళ్ళకెందుకు? వీళ్ళకేం తక్కువని?!

ఇంకా దొంగ సొమ్ములు, మ్యాచ్ ఫిక్సింగ్‌లు చేసి గడిం చుకోవడానికా?

వీళ్ళు ఇలా దొంగ సొమ్ముని బుక్కేస్తున్నదే కాక... వీరి వెనుక... వీరి కోసం ఎందరు బింద్రాలు... ఎందరు సంజీవ్ చావ్లాలు... ఎందరు దాల్మియాలు... ఎందరు... ఎందరు... ఎందరు పడి బ్రతుకుతున్నారో కదా...?!! వీళ్ళంతా ఏమైపోతారు? ఏమై పోతాయి ఇన్ని కోట్ల కొకోకోలాలు... ఇన్ని కోట్ల థంప్సప్‌లు...!! ఇందరు కాపిటలిస్టులు వీళ్ళ వెనక వుండగా ఈ ఆట గాళ్ళు దేనికీ భయపడనవసరం లేదే...!!

కానీ ఒక ప్రార్థన... మీరు దొంగతనం గానో... దొరత నంగానో... గడించుకుంటున్న ఇన్ని కోట్ల వెనుక ఎందరు అభాగ్యులు నాశనమై పోతున్నారో... ఆలోచిం చండి. మీకు అయాచితంగా వచ్చిన ఆ 'అనవసర' ఉద్యోగాలవల్ల ఎన్ని లక్షల అర్హులైన అభాగ్యులు నలిగి నశించి పోతున్నారు...?!! ఒక్కసారి ఆలోచిం చండి...!!

ప్రజల బలహీనతలతో ఆడుకోవడమే ఈ క్రీడల ఉద్దేశం కాదు...! ప్రజల జీవనాడిని చితక్కొట్టడం కాదు ఈ క్రికెట్ ముఖ్యోద్దేశం...!! ఒక టీమును ఓడిం చడం అంటే ఒక దేశాన్ని ఓడించడం కాదు. కానీ ప్రజలు ఈ క్రీడల్లో దేశాన్ని చూసుకుంటున్నారు...!! దేశం బలాన్ని, సత్తాని చూసుకుంటున్నారు... అని మాత్రం గుర్తుంచుకొని 'క్రీడాస్ఫూర్తి7తో ఆడటం నేర్చుకోండి లేదా తప్పుకుని దేశాన్ని బతికించండి...!!

★

## యస్..బాస్..!

సత్యమూర్తి

